# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 242 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 09 ఆగస్టు 2026 | పేజీలు : 2




సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకో..

- జనగామలో రజక సంఘ సమావేశం

2





2 లో

## రైతులకు ప్రాధాన్యత క్రమంలో సాగునీరు : కలెక్టర్

# అంతర్గత విభేదాలు వీడాలి

- కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి
- ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రతీ ఇంటికి చేరవేయాలి
- డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కాంగ్రెస్ కమిటీని సమర్థ వంతంగా ముందుకు తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని, గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమీక్ష సమావేశం, నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం, సన్మాన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని, రాబోయే రోజుల్లో కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను తిప్పికొడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో అమలువుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను గ్రామస్థాయి నుండి బూత్ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి మాట్లాడుతూ.. గిరిజన మహిళగా తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జనగామ జిల్లా కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూపు విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని, 24 గంటలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. వైటీడీఏ బోర్డు మెంబర్ డా. లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ చిన్న చిన్న అభిప్రాయభేదాలు పక్కనబెట్టి పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్లు కడకంచి బాలమణి, తాటికొండ వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, కొత్త కరుణాకర్ రెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.




wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలతో పాటు రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

మన చౌరాస్తా

The Complete News way

# రైతులకు ప్రాధాన్యత క్రమంలో సాగునీరు

- నీటి వనరుల సమర్థ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ
- వరి సాగుకు దూరంగా ఉండి.. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి
- పంట మార్పిడిపై విస్తృత అవగాహన కల్పించాలి
- 15 నుంచి మొదటి విడత, 25 నుంచి రెండో విడతలో సాగునీటి విడుదల
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత సమర్థవంతంగా వినియోగించుకునేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాగునీటి పరిస్థితులు, జలాశయాల్లో నిల్వలు, పంటల సాగు ప్రణాళికపై వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ప్రధాన నిర్ణయాలు..

• **రెండు విడతల్లో సాగునీటి విడుదల :** ప్రస్తుతం రిజర్వాయర్లలో సుమారు 1.5 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నందున, ప్రాధాన్యత క్రమంలో ఈ నెల 15వ తేదీన మొదటి విడతగా, 25వ తేదీన రెండో విడతగా సాగునీరు విడుదల చేసేలా ప్రణాళిక రూపొందించారు.

• **వరి సాగుకు స్వస్తి – ప్రత్యామ్నాయ పంటలకు మొగ్గు :** వర్షపాతం అనిశ్చితంగా ఉన్నందున రైతులు అధిక నీటి అవసరం కలిగిన వరి సాగు వైపు వెళ్లకుండా జొన్న, మొక్కజొన్న, కందులు, పెసర్లు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్, ఉద్యాన వన పంటల వైపు మళ్లేలా గ్రామసభల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

• **పడిపోయిన నీటి నిల్వలు :** జిల్లాలోని మొత్తం 770 చెరువులకు గాను 763 చెరువుల్లో 0-25 శాతం మేర మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని, పరిస్థితికి తగినట్లుగా మండలాల వారీగా (నర్మెట్ట, బచ్చన్నపేట, పాలకుర్తి, తదితర) ఆయకట్టు ఆధారిత ప్రణాళికలు అమలు చేయాలన్నారు.

• **చెరువుల పరిరక్షణ కమిటీల ఏర్పాటు :** గ్రామ స్థాయిలో కాలువలు, కెనాళ్లకు నష్టం జరగకుండా పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, లష్కర్, పోలీసులతో 'చెరువుల పరిరక్షణ కమిటీ'లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

• **చట్టపరమైన చర్యలు :** కాలువలను ధ్వంసం చేసినా, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించినా లేదా అధికారుల విధులకు భంగం కలిగించినా సెక్షన్ 353 కింద కేసులు నమోదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ సీతారాం, డీఏఓ అంబికా సోనీ, డీఈఈలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని ఈవీఎం (EVM) గోదామును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం పరిశీలించారు. సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఈ తనిఖీలో భాగంగా గోదాము వద్ద నమోదు చేస్తున్న భద్రతా రిజిస్టర్, సీసీటీవీ కెమెరాల నిరంతర పనితీరు, అగ్నిమాపక నియంత్రణ పరికరాల సన్నద్ధతను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంల వద్ద భద్రతా ప్రమాణాలను అత్యంత కట్టుదిట్టంగా అమలు చేయాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మాజీ జడ్పీటీసీ సరితకు ఘననివాళి

**చేర్యాల, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం మాజీ జడ్పీటీసీ, చేర్యాల మాజీ ఏఎంసీ (AMC) చైర్మన్ సుంకరి మల్లేశం సతీమణి సుంకరి సరిత ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికరమని జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సరిత అనారోగ్యంతో కన్నుమూశారనే వార్త తెలుసుకున్న ఆయన, వారి స్వగ్రామమైన ఆకునూరును సందర్శించారు. ఆకునూరు చేరుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, సరిత పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను, మాజీ ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

జనగామ, మన చౌరాస్తా : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే సుదీర్ఘ డిమాండ్‌పై ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక డిమాండ్ చేశారు. 2016 అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేగా తాను ఇచ్చిన మాటకు సీఎం కట్టుబడి ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. జనగామ జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను బట్టి వారికి రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని, రజక వృత్తిదారులకు హెల్త్ కార్డులు, పింఛన్, బీమా, సబ్సిడీ పనిముట్లు అందిస్తూ వారిని కార్మికులుగా గుర్తించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రిటైర్డ్ హెడ్మాస్టర్ మామిడాల ప్రభాకర్, మాజీ సర్పంచ్ గట్టికొప్పుల సత్యనారాయణ, ఉల్లెంగుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, మిన్నలపురం జలంధర్, ఏదునూరి వీరన్న, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసర్ల యాకలక్ష్మి, కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యామంకి యుగేంధర్, ఈస్ట్ జోన్ కన్వీనర్ నార్లగిరి కుమారస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఉల్లెంగుల రాములు, రాపర్తి యాకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు, ఆర్ఎంపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షులు మైలారపు అంజన్న, యూత్ అధ్యక్షులు ఓరుగంటి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు మేడిపల్లి వెంకటేశ్వర్లు, ఐతరాజు రాజు, ప్రచార కార్యదర్శి కొన్నె ఉపేంధర్, ముఖ్యసలహాదారులు మంథెన కిష్టయ్య, కార్యవర్గ సభ్యులు పాశం పాపయ్య, సంయుక్త కార్యదర్శి మరిపల్లి వెంకన్న, కోఆర్డినేటర్ ఉల్లెంగుల మల్లేష్, కొడకండ్ల మండల అధ్యక్షులు రాపోలు సోమన్న, మామిడాల లక్ష్మయ్య, చెన్నయ్య, మల్లయ్య, మహేష్, సోమయ్య, పరుశురాములు, పాండ్యల బిక్షపతి పాల్గొన్నారు.



# వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై సమీక్ష

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డా. రవీందర్ నాయక్ శనివారం జిల్లాను సందర్శించి, అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలతో పాటు మాతా శిశు సంక్షేమం, కుటుంబ నియంత్రణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు మరియు వివిధ వ్యాధి నివారణ చర్యల పురోగతిని ఆయన పరిశీలించారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితుల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్లు వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో దోమల నివారణ, లార్వా నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత చర్యలతో పాటు ఫీవర్ సర్వేలను వేగవంతం చేయాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, తక్కువ పనితీరు ఉన్న సూచికలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్షేత్రస్థాయి పర్యవేక్షణను పెంచాలని తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డా. వాణిశ్రీ, జిల్లా స్థాయి అధికారులు డా. సిద్ధార్థ రెడ్డి, డా. జి. హరికృష్ణ, డా. శ్రావ్య, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య,జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి చేతుల మీదుగా జనగామ జిల్లా కేంద్రంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోవు శ్రీనివాస్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.